అక్కణ్నుంచి ఆ రాత్రికి రాత్రే వాళ్లు అంబాసిడర్ కారులో మద్రాసు దగ్గర్లోని విళుపురం పారిపోయారు. అక్కడ తిరుచ్చి వెళుతున్న ఒక మారుతీ వ్యానును ఆపారు. డ్రైవర్‌ను చావబాది, అందులో ప్రయాణిస్తున్న ఒక ప్రైవేటు కంపెనీ అధికారిని, అతని తల్లిని బలవంతంగా కిందకు దింపేసి, ఆ వ్యాను తీసుకుని పారిపోయారు. దాంట్లో తిరుచ్చి వెళ్లి, అక్కడ ఓ రోజు గడిపి, మర్నాడు మధ్యాహ్నానికి సముద్రతీరంలోని మల్లిపట్నం చేరుకున్నారు. ఆ రాత్రికి అక్కడ కొబ్బరితోటల్లో గడిపి, మర్నాడు జాఫ్నాకి బోటెక్కేశారు.

రాజీవ్ హత్య జరిగిన తర్వాత 'సిట్' ఆ అధికారిని వెతికి పట్టుకుని పద్మనాభ హంతకుల వివరాలు సేకరించబోయారు. పద్మనాభ హత్య చేసినది ఎల్‌టిటిఇ అని తెలుసు కాబట్టి దానికీ దీనికీ లింకు దొరికితే ఎల్‌టిటిఇ హస్తం బయటపడుతుందని. ఆ అధికారి చెప్పగలిగినది యిదే - 'వాళ్లు ఆరుగురున్నారు. వాళ్లలో నలుగురు 20-25 ఏళ్లవాళ్లు. అత్యాధునికి ఆయుధాలతో పాటు, వాకీటాకీ సెట్లు కూడా వున్నాయి. పోతూ పోతూ "ఈ విషయం పోలీసులకి ఫిర్యాదు చేశావా, ఖబడ్దార్" అని హెచ్చరిక చేసి పోయారు." ఇంతకుమించి అతను ఏమీ చెప్పలేకపోయాడు.

సిట్ వాళ్లు పద్మనాభ హత్య జరిగి స్థలంలో చెక్క తలుపుల్లోకి దూసుకుపోయిన చిన్న సైజు యినుపగుళ్లు, అటువంటి గుళ్లతో నిండిన ఎస్ఎఫ్‌జి-87 అనే గుర్తుతో పేలని గ్రెనేడ్ దొరికాయి. రాజీవ్ హత్యాస్థలం వద్ద దొరికిన గుళ్లు కూడా యీ సైజువే. దీన్ని బట్టి ఎల్‌టిటిఇయే రాజీవ్ హత్య చేసిందని ఆధారం దొరికింది. కానీ అది చిన్న ఆధారం మాత్రమే. పద్మనాభ హత్య కేసులో డేవిడ్, రఘువరన్‌లు పాల్గొన్నారని నేరపరిశోధక సంస్థలు అనుకున్నాయి. కానీ వారి ఫోటోలు దొరకకపోవడంతో పరిశోధన ముందుకు సాగలేదు. ఎవరికీ ఆధారాలు దొరక్కుండా పద్మనాభ హత్య దిగ్విజయంగా ముగించుకుని వచ్చినందుకు శివరాజన్‌ను, అతని బృందాన్ని ప్రభాకరన్, పొట్టు అమ్మన్ ఘనంగా సన్మానించారు. అందుకే ఏడాది తర్వాత రాజీవ్ హత్య పని కూడా అతనికే అప్పగించారు.

పరిశోధన ముందుకు సాగకపోవడానికి అప్పుడు అధికారంలో వున్న డిఎంకె కారణమని ఏడాదిన్నర తర్వాత 1991 డిసెంబరులో రుజువైంది. కరుణానిధి ముఖ్యమంత్రిగా వుండగా హోం శాఖ కార్యదర్శి ఆర్.నాగరాజన్, డిజిపి పాల్ దురై పాలకత్రయంగా వ్యవహరించారు. రాజీవ్ హత్య జరిగిన తర్వాత జయలలిత అధికారంలోకి రావడంతో సిట్‌కు సహకరించడమే కాక, రాష్ట్ర పోలీసులను కూడా బలోపేతం చేశారు. దాంతో ఎల్‌టిటిఇ స్థావరాలనేకం బయటపడ్డాయి, ఎల్‌టిటిఇ సమర్థకులు అనేకులు బయటపడ్డారు. సిట్‌కు అనుబంధంగా తమిళనాడు సిట్ (టాన్‌సిట్ అన్నారు) ఏర్పాటు చేశారు జయలలిత. దానికి రూపకల్పన డిజిపి శ్రీపాల్. సారథ్యం ఐజీ పి.సి.పంత్. పెద్ద పెద్ద నాయకులందరినీ ప్రశ్నించడానికి దీనికి విశేషాధికారాలు యిచ్చారు. డిఎంకె అధినేత కరుణానిధికి, ఆయన కుమారుడు అళగిరికి ఎల్‌టిటిఇ వారితో వున్న సంబంధాలు అనేకం వెలుగులోకి వచ్చాయి.

పద్మనాభ హత్య జరిగినపుడు అప్పటి డిజిపి పాల్‌దురైకి నాగరాజన్ ఫోన్ చేసి హంతకులను వేటాడవద్దనీ, కేసు జోలికి పోవద్దనీ చెప్పారని తెలిసింది. దాంతో నాగరాజన్‌ను జయలలిత ప్రభుత్వం 'టాడా' కింద అరెస్టు చేసింది. ఆయన తిరుచ్చి మేజిస్ట్రేట్‌ముందు వాంగ్మూలం యిస్తూ తాను చెప్పిన మాట వాస్తవమేననీ, కానీ యివి అధికారుల లోపాలు కావనీ, రాజకీయ ప్రోద్బలంతో జరిగినవనీ అన్నారు. టైగర్లు తమిళనాడును స్థావరం చేసుకోవడానికి కరుణానిధి, ప్రభుత్వ మాజీ కార్యదర్శి, కేంద్రంలో అప్పటి క్రీడా కార్యదర్శి, ఎంఎం రాజేంద్రన్ ప్రభృతులే కారణమనీ నాగరాజన్ వెల్లడించారు. పద్మనాభ హంతకులు ఎవరో దొరైకి తెలుసని అన్నారు.

నాగరాజన్ యిలా స్టేటుమెంటు యిచ్చారని తెలియగానే 1991 డిసెంబరులో పాల్‌దురై మరణించారు. అప్పటికే యీ విషయమై ఆయనపై 'క్యూ' బ్రాంచ్ అనుమానిస్తోంది. హంతకులు టైగర్లు కాదని దురై వాదిస్తూ వుండేవారు. విషయం బయటపడడంతో అపరాధభావనతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని పుకార్లు వచ్చాయి. కానీ ఆయన కుటుంబసభ్యులు 'లేదు, షుగర్ పడిపోయి మరణించారు. ఛాతీలో నొప్పి అంటే నర్సింగ్ హోంకు తీసుకెళితే అక్కడ పోయార'ని అన్నారు. ఆయన అధికారంలో వుండగా మద్రాసు సమీపంలో 19 ఎకరాల భూమి ఎలా సంపాదించావో చెప్పమని ఐటీ అధికారులు అప్పటికే అడుగుతున్నారు. దీనికంతా జయలలిత కక్షే కారణమని ఆయన భార్య ఆరోపణ. తమాషా ఏమిటంటే ఆయన క్రైస్తవుడైనా ఆయన శరీరాన్ని కుటుంబం దహనం చేసింది. దాంతో పోస్ట్ మార్టమ్ చేసే వీలులేకుండా పోయింది.



నాగరాజన్

ఈ విధంగా డికె, డిఎంకెలు సహకరించడం వలననే ఎల్‌టిటిఇ మన దేశంలో మన మాజీప్రధానిని చంపగలిగింది. ఇటువంటివాళ్లు వుండగా ఏదైనా సాధ్యమే అని అర్థం చేసుకోవాలి. ఇదే పోలీసువ్యవస్థ ముఖ్యమంత్రి మారగానే అత్యంత సమర్థవంతంగా మారి రాజీవ్ హంతకులను మూడునెలల్లో పట్టుకోగలిగింది. అంటే అంతా పైవాడి మీద ఆధారపడి వుందన్నమాట. డికె, డిఎంకెలు ఎందుకిలా ప్రవర్తించాయో వాటి కథ తర్వాత చెప్తాను. ప్రస్తుతానికి తెలుసుకోదగినదేమిటంటే ఎవరికీ ఆధారాలు దొరక్కుండా పద్మనాభ హత్య

దిగ్విజయంగా ముగించుకుని వచ్చినందుకు శివరాజన్‌ను, అతని బృందాన్ని ప్రభాకరన్, పొట్టు అమ్మన్ ఘనంగా సన్మానించారు. అందుకే ఏడాది తర్వాత రాజీవ్ హత్య పని కూడా అతనికే అప్పగించారు. హంతకబృందంలో తక్కిన వ్యక్తుల గురించి వచ్చే సోమవారం (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**


మాజీ డి.జి.పి.: అనుమానాస్పద మృతి

**పాల్ దురై**